
నమస్తే తెలంగాణ
సిద్దిపేట
13 హైదరాబాద్, శుక్రవారం 29 మార్చి 2024 SIDDIPET

# నీలం మధు ఎంపికపై కాంగ్రెస్‌లో అసంతృప్తి

- సర్పంచ్ నుంచి ఏకంగా మెదక్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి..
- సీనియర్లకు మింగుడుపడని అధిష్టానం నిర్ణయం

సంగారెడ్డి మార్చి 28 (నమస్తే తెలంగాణ): మెదక్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ దిగ్గజ నేతలు బరిలో నిలిచి గెలిచిన చరిత్ర ఉంది. కాంగ్రెస్‌ను అన్నీతానై శాసించిన ఇందిరాగాంధీ మెదక్ నుంచి ఎంపీగా గెలిచి ఏకంగా ప్రధానమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ నేతలు పి.హన్మంతరావు, సంగం లక్ష్మీబాయి, బాగారెడ్డి ఎంపీలుగా పోటీ చేసి గెలుపొందారు. బాగారెడ్డి వరుసగా నాలుగుసార్లు మెదక్ ఎంపీగా విజయం సాధించారు. కాంగ్రెస్‌కు దిగ్గజ నేతలు పోటీ చేసిన మెదక్ పార్లమెంట్ నుంచి ఈసారి ఇందిరా గాంధీ వారసులు రాహుల్ లేదా ప్రియాంక పోటీ చేస్తారని కాంగ్రెస్ నేతలు ఆశించారు. కాంగ్రెస్ అధిష్టానం అనూహ్యంగా చిట్కుల్ సర్పంచ్‌గా పనిచేసి ఇటీవలే పార్టీలో చేరిన నీలం మధుకు మెదక్ ఎంపీ టికెట్ కట్టబెట్టింది. కాంగ్రెస్ అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయం పార్టీ సీనియర్లకు మింగుడు పడటం లేదు. మెదక్ ఎంపీ టికెట్ కోసం పలువురు సీనియర్ నాయకులు పోటీ పడ్డారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, నరేంద్రనాథ్ పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే వీరిని కాదని కాంగ్రెస్ అధిష్టానం చిట్కుల్ సర్పంచ్‌గా పని చేసిన నీలం మధుకు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వటం ఆశావహులు జీర్ణించుకోలేక పోతున్నారు. ముఖ్యంగా నీలం మధుకు టికెట్ ఇవ్వటం సంగారెడ్డి, మెదక్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ముఖ్యనేతకు ఇష్టం లేదు. పార్టీ టికెట్ ఇచ్చినా జిల్లాలోని కాంగ్రెస్ సీనియర్లు ఈ అభ్యర్థికి సహకరించే అవకాశాలు కనిపించటం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ వందరోజుల పాలనలో హామీలు నిలబెట్టుకోక పోవటం కాంగ్రెస్ అభ్యర్థికి ప్రతికూలంగా మారనున్నది.



**నాడు కాదని... ఇప్పుడు ఎంపీ టికెట్**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని చిట్కుల్ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నీలం మధు అంచలంచెలుగా మెదక్ ఎంపీ అభ్యర్థి స్థానానికి ఎదిగారు. బీసీ ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన నీలం మధు 2006లో చిట్కుల్ వార్డు మెంబర్‌గా, 2014లో ఉప సర్పంచ్‌గా పనిచేశారు. 2014లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2019లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గతేడాది జరిగిన శాసనసభ సాధారణ ఎన్నికల సమయంలో నీలం మధు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. టికెట్ దక్కకపోవటంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ సైతం టికెట్ ఇవ్వకపోవంతో బీఎస్పీ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి 46వేల ఓట్లు పొందారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తిరిగి ఆ పార్టీలో చేరారు. పటాన్‌చెరు ఎమ్మెల్యేగా టికెట్ ఇవ్వని కాంగ్రెస్ ఇప్పుడు ఏకంగా మెదక్ ఎంపీ టికెట్ కట్టబెట్టింది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఏదైనా సాధ్యమేనన్న చర్చ సాగుతోంది. అయితే బీఆర్‌ఎస్ కంచుకోటగా ఉన్న మెదక్ పార్లమెంట్‌లో గెలవడం అంతా ఈజీకాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మధుకు నాయకులు, కార్యకర్తలు సపోర్టులేక పోతే గెలవడం కష్టమే.

## సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలిపిచెడ్ (కొల్చారం), మార్చి 28: వానకాలం, యాసంగి 2022-23కు సంబంధించి బియ్యం అప్పగించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం కొల్చారంలో శ్రీ సత్యసాయి రైస్‌మిల్, శ్రీధర్ ఇండస్ట్రీస్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు ఆదర్శనీయంగా ఉండాలని సూచించారు. వానకాలం, యాసంగి 2021-22కు సంబంధించిన బియ్యం అప్పగించి, పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు వచ్చేనెల 30లోగా డెలివరీ పూర్తి చేయాలన్నారు. లేకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్, సివిల్ సప్లయ్ అధికారులు హరికృష్ణ, ప్రణిత, సాధిక్ ఉన్నారు.

## సబ్సిడీ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తాం

- జిల్లా పశు వైద్యాధికారి వెంకటయ్య

**నమస్తే తెలంగాణ ఎఫెక్ట్**


శివ్వంపేట, మార్చి 28: గోమారంలో సోమవారం రాత్రి బండ యాదయ్యకు చెందిన గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందడం బాధాకరం. భవిష్యత్తులో బాధిత కుటుంబానికి శాఖాపరంగా సబ్సిడీ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తామని జిల్లా పశువైద్యాధికారి వెంకటయ్య తెలిపారు. బుధవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కుక్కల దాడిలో 28 గొర్రెలు మృతి వార్తకు జిల్లా పశు వైద్యాధికారులు స్పందించి గొర్రెల మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 22 గొర్రెలు మృతి చెందాయని, మిగతా ఆరు గొర్రెలకు గాయాలు కాగా వాటిని చికిత్స అందిస్తున్నామని చెప్పారు. గొర్రెల పాక చుట్టూ సరైన రక్షణ కవచం ఏర్పాటు చేసుకోవాలని పశు వైద్య సిబ్బంది బాధితులకు సూచనలు చేసినట్లు తెలిపారు.

# మెదక్ కాంగ్రెస్‌లో అసమ్మతి

## మెదక్ అభ్యర్థి నీలం మధు ప్రకటనపై అసంతృప్తి

- మైనంపల్లికి కాంగ్రెస్ పార్టీ మొండిచేయి
- జిల్లాలో వర్గాలుగా చీలిపోయిన కాంగ్రెస్ నాయకులు
- ఏ వర్గంలో చేరాలో తెలియక ఇతర పార్టీల్లో చేరుతున్న కార్యకర్తలు
- బీఆర్‌ఎస్ కంచుకోట మెదక్‌లో కాంగ్రెస్ గెలిచే అవకాశం లేదంటున్న విశ్లేషకులు

సిద్దిపేట, మార్చి 28( నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికార కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థిని ఎట్టకేలకు ప్రకటించింది. పార్టీ అభ్యర్థిగా ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నీలం మధును ప్రకటించడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి తారాస్థాయికి చేరుకుంది. పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులకు కాకుండా ఇవ్వాళ పార్టీలోకి వచ్చిన నేతలకు ఎలా టికెట్ ఇస్తారంటూ, పార్టీ అధిష్టానంపై నేతలు మండి పడుతున్నారు. పార్టీ కోసం పనిచేసిన నేతలకు గుర్తింపు లేకుండా పోయిందని ఆ పార్టీ సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థి కోసం పని చేసేది లేదంటూ కొంతమంది నేతలు బాహాటంగానే ప్రకటిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ వర్గాలుగా చీలిపోయింది. దీంతో పార్టీ కార్యకర్తలు ఏ వర్గం కింద పనిచేయాలో అర్థంకాక ఇతర పార్టీల్లో చేరిపోతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చినప్పటికీ ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ హవా కొనసాగింది. ఏడు శాసన సభ స్థానాలకు గానూ ఒక మెదక్ అసెంబ్లీ మినహా, అన్ని చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గెలుపొందారు. దీంతో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలవడం అంత ఈజీకాదు. పైగా మెదక్ పార్లమెంట్ స్థానం బీఆర్‌ఎస్ పార్టీ కంచుకోట. కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి దామోదర రాజనర్సింహను నియమించింది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహల గ్రూపులు జిల్లాలో కొనసాగుతున్నాయి. దీంతో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి విషయంలో పార్టీలో ఏకాభిప్రాయం కుదరలేదని తెలిసింది. దీంతో అభ్యర్థి ప్రకటనతో పార్టీలో అసమ్మతి బయట పడింది. గత శాసన సభ ఎన్నికల్లో పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థి కాటం శ్రీనివాస్ గౌడ్ ఓడిపోవడానికి ప్రధాన కారకుడైన నీలం మధుకు టికెట్ ఎలా ఇస్తారని పటాన్‌చెరువు నియోజకవర్గ పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఆ రోజు తొలుత పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నీలం మధును ప్రకటించిన అధిష్టానం తీరుకు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. చివరకు గాంధీభవన్‌లో పెద్ద రభసే చేశారు. ఆరోజు మంత్రి దామోదర రాజనర్సింహా కలుగజేసుకొని పార్టీ అధిష్టానంతో మాట్లాడి పటాన్‌చెరు అభ్యర్థిని మార్పించారు. తన ముఖ్య అనుచరుడైన కాటం శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్ ఇప్పించుకున్నారు. దీంతో నీలం మధు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఎస్పీలో చేరి ఆ పార్టీ టికెట్‌పై పోటీ చేశారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలుపకుండా ఇతర పార్టీలో చేరి శ్రీనివాస్‌గౌడ్‌ను ఓడగొట్టిన ప్రస్తుత మెదక్ పార్లమెంట్ అభ్యర్థికి ఎలా ప్రచారం చేస్తామంటూ ఆ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో టికెట్ తెచ్చుకున్న నీలం మధుకు పార్టీ క్యాడర్ అంతగా సహకరించే అవకాశాలు లేవని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి.



మెదక్ పార్లమెంట్ అభ్యర్థి విషయంలో రకరకాల పేర్లు వినిపించాయి. మాజీఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతోపాటు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి లేదా ఆయన సతీమణి నిర్మల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. మరోవైపు ఇతర పార్టీల నుంచి చేర్చుకొని వారికి టికెట్ ఇస్తారని ప్రచారం చేశారు. ఇతర పార్టీల్లోని ఒక నేత కోసం ఒక వర్గం తీవ్రంగానే ప్రయత్నాలు చేసింది. ఢిల్లీ కేంద్రంగా చివరివరకు లాబీయింగ్ చేసినట్లు సమాచారం. మాజీఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మెదక్ నుంచి పోటీ చేస్తున్నానని, తనకే టికెట్ వస్తుందని మెదక్ పార్లమెంట్ పరిధిలో హల్‌చల్ చేశారు. ఇతర పార్టీల నేతల వద్దకెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరాలి అని కోరారు. ఆయన మాటలను ఎవ్వరు కూడా విశ్వసించలేదు. చివరకు కాంగ్రెస్ పార్టీ మైనంపల్లి హన్మంతరావుకు మొండిచేయి చూపింది. ఇటీవల సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ నేతలు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనంపల్లి ఇతర నేతలు హాజరవుతారని ప్రచారం చేశారు. కానీ మైనంపల్లి చేష్టలతో మంత్రి పొన్నం ప్రభాకర్ గైర్హాజరయ్యారు. ఒకింత మైనంపల్లి హన్మంతరావుపై అసంతృప్తిగానే మంత్రి ఉన్నట్లు సమాచారం. ఇలా ఒకరి కంటే ఒకరు జిల్లాలో పెత్తానం చెలాయించాలని చూస్తున్నారు. దీంతో పార్టీ క్యాడర్ నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కొద్ది రోజులుగా నియోజకవర్గానికి రావడం లేదు. కార్పొరేషన్ ఇతర పదవుల పైరవీల్లోనే ఉన్నట్లు సమాచారం. ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ల పదవుల పంపిణీపై అసమ్మతి రాజుకుంటుంది. నంగునూరు మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలు కొట్లాటకు దిగి పోలీస్ స్టేషన్ వరకు వెళ్లిన సంఘటన చూశాం. నిన్నటికి నిన్న స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మికి కనీస మర్యాద ఇవ్వలేదని బోరున విలపించిన సంగతి తెలిసిందే. పార్టీలో పనిచేసే నాయకులను, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని ఆ పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోట లాంటి మెదక్‌లో కాంగ్రెస్ పార్టీ బతికి బట్టకడుతుందా..? అని ఆ పార్టీ నేతలు బాహాటంగా చెబుతున్నారు.

### మైనంపల్లి హన్మంతరావుకు మొండిచేయి

# స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ చెన్నూరి రూపేశ్‌తో కలిసి ఎన్నికల వ్యయ నియంత్రణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ, గ్రీవెన్స్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీల్లో పట్టుబడిన నగదుకు రసీదు అందించి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందజేయాలన్నారు. బార్డర్ చెక్‌పోస్టుల్లో తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ 24 గంటలు ఉండాలన్నారు. అభ్యర్థులు సువిధ యాప్‌లో అన్ని అనుమతులు పొందవచ్చన్నారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ఖర్చు రూ.90 లక్షలకు మించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు నిర్వహించే రోడ్ షోలో భోజనాల ఖర్చులను ఎఫ్ఎస్టీ బృందంలో రికార్డు చేయాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్ ప్రచారాలు నిలిపివేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి అనుమతితో అభ్యర్థులు ఖర్చుల వివరాలు అకౌంటింగ్ బృందం అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలన్నారు. నేషనల్ హైవే 65పై తనిఖీ కేంద్రాల వద్ద విధిగా అన్ని వాహనాలను పూర్తిగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. సీ విజిల్ యాప్ 1950 గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, యాప్‌లో వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ మాట్లాడుతూ తనిఖీల సమయంలో చెక్‌పోస్టుల వద్ద ప్రజలను భయభ్రాంతులకు గురిచేయకుండా సూచనలు చేయాలని, పట్టుబడ్డ నగదుకు రసీదు అందించాలని వివరించారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించి నగదు పట్టుబడితే ఎఫ్ఐఆర్ చేయాలని స్పష్టం చేశారు. ప్రచార వాహనాల నెంబర్లు పరిశీలించాలని, ప్రచారాల్లో డీజేలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొని వచ్చే వాహనాలను తనిఖీ చేయాలన్నారు. మనరాష్ట్రంలో ధాన్యం కొనుగోలు వాహనాలకు అనుమతులు ఉన్నాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, జడ్పీసీఈవో జానకీరెడ్డి, డీఎఫ్‌వో శ్రీధర్, ఎల్‌డీఎం గోపాల్, ఏఆర్వోలు, ఆర్టీవోలు, ఎక్సైజ్ అధికారులు, నోడల్, పోలీసు అధికారులు, అటవీశాఖ అధికారులు, ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

# దాడులు చేస్తే భయపడం

- ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన కొనసాగించాలి
- పంటలు, మంచినీటి గోసపై దృష్టి పెట్టాలి
- బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మామిండ్లపై దాడికి ఖండిస్తున్నాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన చేయాలి. కానీ బీఆర్‌ఎస్ కార్యకర్తల మీద దాడులు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మెదక్ 5వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు ఇంటిని కాంగ్రెస్ నాయకులు ముట్టడించడాన్ని నిరసిస్తూ మెదక్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5వ వార్డ్ కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు ఇంటి వద్ద కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఇలాంటి దాడులకు తావులేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రెండు టికెట్లు ఇవ్వనందుకు ఒకటేరోజు మూడు కండువాలు మార్చారని గుర్తు చేశారు. భూగర్భ జలాలు తగ్గి రైతుల పంటలు ఎండుతున్న తరుణంలో పంటలను పరిశీలించి రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు మంచినీళ్ల కోసం ఇబ్బంది పడుతుంటే దానిగురించి పట్టించుకోకుండా ప్రతిపక్షాల మీద దాడి చేయడం సరికాదన్నారు. తెలంగాణ కోసం 14 ఏండ్లు పోరాటం చేసి సాధించామని, ఇప్పుడు కేసులు పెడితే ఎవరూ భయపడేదిలేదన్నారు. కౌన్సిలర్‌పై దాడిని నిరసిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో లావణ్యారెడ్డి, గంగాధర్, మల్లికార్జున్ గౌడ్, మామిండ్ల ఆంజనేయులు, కిశోర్, శ్రీనివాస్, మాధవి, రాజు, లింగారెడ్డి, అశోక్, శ్యామ్‌సుందర్, లింగం, సతీష్‌రావు, లక్ష్మిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కుమార్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



గురువన్నపేటలో ట్యాంకర్ ద్వారా వరి పొలానికి నీళ్లు పారిస్తున్న రైతు వెంకట్

## తలాపున తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా..

- చుక్క నీరులేక ఎండుతున్న పంటలు

కొమురవెల్లి, మార్చి 28: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో పదేండ్లలో ఎప్పుడూ లేనివిధంగా నీళ్ల కష్టాలు మొదలయ్యాయి. పక్కనే కూతవేటు దూరంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా గురువన్నపేట రైతుల పంటలు మాత్రం ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. గ్రామానికి చెందిన రైతు పుట్ట వెంకట్ మూడు ఎకరాల్లో వరి వేయగా నీళ్లు లేకపోవడంతో అందులో సగం ఇప్పటికే ఎండిపోయింది. మిగతా పంటను బతికించుకోవాలని నీళ్ల ట్యాంకర్‌ను కిరాయికి మాట్లాడుకొని రెండు రోజులకోసారి వరికి నీళ్లు పెడుతున్నాడు. తాను ఐదేండ్ల క్రితం బోరు వేశానని, మూడెకరాలు పారేదని, ఈసారి మాత్రం కండ్ల ఎదుటే పంట ఎండిపోతుంటే చెప్పలేని బాధ కలుగుతుందని వాపోయాడు.


గురువన్నపేటలో నీళ్లు లేక ఎండిపోయిన వరి పొలం

# తాగునీళ్లు.. మహాప్రభో!

## ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లో తాగునీటికి కటకట

- నీళ్ల కోసం వ్యవసాయ బావుల వద్దకు బారులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 28: ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో వారంరోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. గుక్కెడు నీటి కోసం గ్రామస్తులు అరిగోస పడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో గ్రామానికి నీటిని సరఫరా చేసే రెండు బోరుబావుల్లో ఒక్క బోరుబావి ఎండిపోయింది. దీనికితోడు మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీళ్లు సరిపడకపోవడంతో గ్రామంలో నీటి సమస్య అధికమైంది. నీళ్ల కోసం గ్రామస్తులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తుండడం శోచనీయం. గ్రామం లో నాలుగు రోజులుగా జరుగుతున్న బీరప్ప పండుగకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తాగేందుకు నీళ్లు లేక ఇబ్బందులు పడ్డారు. మునుపెన్నడూ గ్రామంలో నీటి సమస్య రాలేదని, వారం రోజులుగా నీళ్ల కోసం అలమటిస్తున్నామని, బావుల వద్దకు వెళ్తున్నామని గ్రామానికి చెందిన తాడెం రాములమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు. మద్దూరు మండల పరిషత్ కార్యాలయానికి నీటి ఇక్కట్లు తప్పడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో వివిధ పంచాయతీలకు చెందిన వాటర్ ట్యాంకర్ల ద్వారా కార్యాలయానికి నీటిని సరఫరా చేస్తున్నారు. కార్యాలయంలో నీటి కొరత ఏర్పడడంతో కార్యాలయ ఉద్యోగులతో పాటు నిత్యం కార్యాలయానికి వచ్చే సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.


లింగాపూర్‌లో బోరుమోటర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న రాములమ్మ



మద్దూరులో ట్యాంకర్ సాయంతో ఎంపీడీవో కార్యాలయం సంపులో నీళ్లు పోస్తున్న పంచాయతీ సిబ్బంది


ఎండిపోయిన వరి పంటను బిక్కుబిక్కుమంటూ చూపిస్తున్న రైతు ధనుంజయ్

# నీరులేక ఆరెకరాల్లో... నిలువునా ఎండిన పంట

## ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న రైతు

నర్సాపూర్, మార్చి 28: పంటలకు నీరందక నేలలు నెర్రెలుబారి కండ్ల ఎదుటే ఎండిపోతుంటే రైతుల ఆక్రందనలు వర్ణనాతీతంగా మారాయి. పదేండ్లలో పచ్చని పంటలతో చిరునవ్వులు చిందించిన రైతన్న కండ్లల్లో కన్నీళ్లు ఆపడం ఎవరితరం కావడం లేదు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గ్రామానికి చెందిన యువ రైతు అయ్యావారి ధనుంజయ్ వరి చేను నీళ్లు లేక ఎండిపోవడంతో గుండెలు బాదుకుంటున్నాడు. తనకున్న 6 ఎకరాల 20 గుంటల పొలంలో రూ.లక్ష పది వేల పెట్టుబడితో వరి నాటాడు. పొలంలో మూడు బోర్లు ఉన్నప్పటికీ భూగర్భజలాలు ఎన్నడూలేని విధంగా ఈసారి అడుగంటిపోవడంతో బోర్లు నీరు పోయడం ఆపేశాయి. దీంతో రైతు ధనుంజయ్ చేసేదేమి లేక ఎండిపోతున్న వరి పంటను దిగాలుగా చూస్తూ కన్నీరు పెట్టుకున్నాడు. ఎండిపోయిన వరి పంటలో గేదెలను మేపాడు. ప్రభుత్వం స్పందించి ఎండిపోయిన వరి పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


ఎండిపోయిన వరి పంటను మేస్తున్న గేదెలు